అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 211. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ శుక్రవారం.09.05.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## లద్దాఖ్‌లో డ్రోన్లు, యూఏవీలపై నిషేధం

లేహ్: అమృత్ తెలంగాణ: లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతంలోని కార్గిల్, లేహ్ జిల్లాల్లో డ్రోన్లు, మానవ రహిత గగనతల వాహనాలు (యూఏవీ)లను ఎగురవేయడంపై నిషేధం విధించారు. ఈ జిల్లాల కలెక్టర్లు వేర్వేరుగా జారీ చేసిన ఆదేశాల్లో, దేశ వ్యతిరేక శక్తులు వీటిని దుర్వినియోగపరిచే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం అందినట్లు తెలిపారు. వీటిని ఎగురవేసే స్థానికులు, పర్యాటకులు లేదా ప్రైవేట్ వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రోన్ లేదా యూఏవీ ఎగురుతుండటాన్ని చూస్తే, వెంటనే ఆ సమాచారాన్ని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు లేదా సమీపంలోని పోలీసు లేదా ఇతర అధికారులకు తెలియజేయాలని కోరారు.

## ఉగ్రవాదం అంతం కావాల్సిందే

మేడ్చల్,/జవహర్‌నగర్ మే 8 :అమృత్ తెలంగాణ: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు కశ్మీర్‌కు వెళ్లిన పర్యాటకులను కాల్చి చంపడం దారుణమన్నారు. భారత మహిళల నుదుట సిందూరాన్ని తుడిపేసిన ఉగ్రమూకలపై జరిగిన దాడిలో కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండ్ వ్యోమికా సింగ్ నాయకత్వం వహించడం దేశానికే గర్వకారణమన్నారు. వారిని ప్రతి మహిళ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు జాతీయ జెండాను చేత పట్టుకొని, దేశానికి, సైనికులకు అనుకూలంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవీలత, అధ్యాపకులు, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్టీలు -సిద్ధాంతాలు వేరైనా - దేశ కోసం ఒక్కటవుతాం

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాజకీయ పార్టీలు.. వాటి సిద్ధాంతాలు వేరైనా దేశ రక్షణ కోసం అందరం ఒక్కటవుదామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశం వైపు కన్నెత్తి చూస్తే వారికి భూమిపై నూకలు చెల్లుతాయని హెచ్చరించారు. ఉగ్రవాదుల దాడిలో 26 మంది భారతీయులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఆర్మీ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సంపూర్ణ మద్దతు తెలిపారని గుర్తు చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయం ముందున్న రాజీవ్‌గాంధీ విగ్రహం నుంచి నెక్లెస్‌రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు రాష్ట్ర ప్రభుత్వం జాతీయ సంఘీభావ ర్యాలీని నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, డీజీపీ రవి గుప్తా ర్యాలీలో అగ్రభాగాన నడిచారు. ఈ సందర్భంగా 'జై జవాన్, జై హింద్, వందేమాతరం' నినాదాలతో మార్మోగాయి. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి చిత్రపటాలకు సీఎం పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గత కొంత కాలంగా ఉగ్రవాదులు దేశ సరిహద్దుల్లోకి చొచ్చుకుని వస్తున్నారని తెలిపారు. పాకిస్తాన్ ప్రోత్సాహంతో భారతీయ పౌరులను మట్టుపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మన అమ్మలు, అక్కలు, చెలెళ్ల నొదుటి సింధురాన్ని తుడ్చేశారని వాపోయారు. భారతీయులపై దాడి చేశామంటూ ఉగ్రవాదులు విర్రవీగారని తెలిపారు. 140 కోట్ల భారతీయుల పక్షాన భారత సైన్యం వారికి గుణపాఠం చెప్పిందన్నారు. దేశ సార్వభౌమాధికారంపై ఎవరూ దాడి చేసినా వదలబోమని హెచ్చరించారు. శాంతియుత మార్గం ద్వారానే మహాత్మగాంధీ నాయకత్వంలో బ్రిటిష్ ప్రభుత్వం నుంచి దేశానికి విముక్తి లభించిందన్నారు. అయితే




శాంతికాముకులైన భారతీయులు దాడి చేసినా ఊరుకుంటారని భావించొద్దని హెచ్చరించారు. దేశంపై దాడి జరిగితే భారతీయులు గొప్ప స్ఫూర్తిని ప్రదర్శిస్తారని చెప్పారు. భారతీయుల శాంతి స్వభావాన్ని చేతగానితనంగా భావించొద్దంటూ పాకిస్తాన్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌తోపాటు టీపీసీసీ అధికార ప్రతినిధి కృష్ణతేజ, సచివాలయ ఉద్యోగులు, వివిధ ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన ఉద్యోగులు, ఆర్మీ మాజీ అధికారులు, మాజీ సైనికులు, యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు.

# ఎన్ని ఒత్తిళ్లొచ్చినా ఎవరినీ వదలొద్దు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: "ఒక మంచి ఆలోచనతో హైడ్రాను ఏర్పాటు చేశాం.. అక్రమ నిర్మాణాలు.. ఆక్రమణల విషయంలో ఎన్ని ఒత్తిళ్లొచ్చినా ఎవరినీ వదలొద్దు.. మీ వెంట నేనున్నా.. ఢిల్లీలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు రావొద్దనే హైడ్రాను తీసుకొచ్చాం.." అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ బుద్ధభవన్‌లో గురువారం హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశంలోని పలు మెట్రోపాలిటన్ నగరాల్లో జీవించలేని పరిస్థితులు నెలకొంటున్నాయని చెప్పారు. బెంగళూరులో గత ఏడాది వేసవిలో నీటి కరువు వచ్చిందని, ముంబయి, చెన్నై వంటి నగరాల్లో వరదలు రావడంతో అతలాకుతలమైనట్టు వివరించారు. 2, 3 అంతస్తుల భవనాలు సైతం మునిగిపోయిన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం పెరిగిపోయి జీవించలేని పరిస్థితి నెలకొందని, మెట్రోనగరాల్లో వస్తున్న ఉపద్రవం నుంచి గుణపాఠం నేర్చుకోకపోతే మనకూ నష్టం జరుగుతుందని చెప్పారు. అలాంటి నగరాల సరసన హైదరాబాద్ చేరకూడదనే ఉద్దేశంతోనే హైడ్రాను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. హైడ్రా అంటే పేదల ఇండ్లు కూల్చుతుందని కొంతమంది తప్పుగా చిత్రీకరిస్తున్నారని.. హైడ్రా అంటే కూల్చడమే కాదు, ఆస్తులను రక్షించడం, విపత్తుల నిర్వహణ అని తెలిపారు. ఎవరెన్ని విమర్శలు చేసినా ఆక్రమణలను నియంత్రించదలచుకున్నామని స్పష్టం చేశారు. పేదలను, పెద్దలను ఒకేలా చూడొద్దన్నారు.

నిజాం సర్కార్‌ను కదిలించింది

ప్రకృతిని కాపాడితే అది మనలను కాపాడుతుందని సీఎం అన్నారు. పూర్వీకులు మనకు ఇచ్చిన చెరువులను కాపాడుకోవాలని, చెరువులు కనుమరుగైతే మనుగడ ఉండదని అన్నారు. 450 ఏండ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్ నగరాన్ని కాపాడుకొనేందుకు హైడ్రా ఉపయోగపడుతుందన్నారు. 1908లో హైదరాబాద్‌లో వచ్చిన వరదలు అప్పటి నిజాం సర్కార్‌ను కదిలించాయని చెప్పారు. దాంతో గొప్ప ఇంజినీర్ అయిన మోక్షగుండం విశ్వేశ్వరయ్యను పిలిపించి హైదరాబాద్‌లో మూసీపై డ్రయినేజీ వ్యవస్థ నిర్మించారని గుర్తు చేశారు. తదనంతరం క్రమంగా నగరం విస్తరించడం, జనాభా పెరగడం.. ఆక్రమణలూ పెరగడం వల్ల నేడు చిన్న వర్షం వస్తే నగరంలో కాలనీలు మునిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పేదల కాలనీలకు వెళ్లే దారులను పెద్దలు ఆక్రమిస్తు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాకు గురైన చెరువులు, నాలాలు, కాలనీల రోడ్లను హైడ్రా రక్షిస్తోందన్నారు. లేక్‌వ్యూ ఫేస్‌తో చెరువుల పక్కన కొందరు ఫామ్‌హౌస్‌లు, గెస్ట్ హౌస్‌లు నిర్మించుకున్నారని, వాటి నుంచి వ్యర్థాలు, మురుగునీటిని చెరువుల్లోకి వదులుతున్నారని తెలిపారు. చెరువులు, నాలాలు ఆక్రమించిన వారికే హైడ్రా అంటే భయమని చెప్పారు. మూసీ పక్కన పడుకుంటే అక్కడ కష్టాలు ఎలా ఉంటాయో ఆ నేతలకు తెలుస్తాయని తెలిపారు. మూసీ నది పరివాహక ప్రజలతో త్వరలోనే ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామన్నారు.

వాళ్లు చేస్తే ఒప్పు.. మేం చేస్తే తప్పా?

మూసీని ప్రక్షాళనను కొందరు కావాలనే అడ్డుకుంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి




అన్నారు. సబర్మతి, గంగా నది, యమునా నదిని బీజేపీ ప్రభుత్వం ప్రక్షాళన చేయలేదా? వారు చేస్తే ఒప్పు, మేం చేస్తే తప్పా? అని ప్రశ్నించారు. మూసీలో ఆక్రమణలు తొలగిస్తే రియల్ ఎస్టేట్ పడిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంచ గచ్చిబౌలి భూముల్లో అభివృద్ధి పనులు చేపడితే దాన్ని కూడా అడ్డుకున్నారన్నారు. ఐఎంజీ భారత్ అనే సంస్థ చేతిలో ఉన్న 400 ఎకరాల భూములను తామే కాపాడామని తెలిపారు. ఆ 400 ఎకరాలు ప్రయివేటు వ్యక్తి చేతుల్లో ఉంటే గత ప్రభుత్వం పదేండ్లు పట్టించుకోలేదని విమర్శించారు. తాము కాపాడిన భూముల్లో కంపెనీలు నిర్మిస్తే లక్ష ఉద్యోగాలు వస్తాయన్నారు. కానీ నగరం అభివృద్ధి కాకుండా, కొత్త ఉద్యోగాలు రాకుండా అడ్డుతగులుతున్నారని తెలిపారు. హైడ్రా పోలీస్ స్టేషన్‌తోపాటు హైడ్రాకు సమకూర్చిన వాహనాలు, యంత్రాలను సైతం సీఎం ప్రారంభించారు.

మరింత బలం చేకూరింది: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

హైడ్రాకు పోలీస్ స్టేషన్ రావడంతో మరింత బలంతో డైందని కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఇప్పటి వరకు హైడ్రా 3600 కేసులను పరిష్కరించిందని, 30 టీమ్స్ పనిచేస్తున్నాయని వివరించారు. రాబోవు రోజుల్లో 71 బృందాలను ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. హైడ్రా పోలీస్‌స్టేషన్ ఇవ్వడం, దానికి కావాల్సిన సిబ్బందిని కేటాయించడంతో సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముంపు బాధితుల సమస్యలను హైడ్రా వెంటనే పరిష్కరిస్తుందని చెప్పారు. ప్రజలు ఏ విభాగాన్ని సంప్రదించాలో తెలియని సమస్యల్ని సైతం హైడ్రా పరిష్కరిస్తోందన్నారు. హైడ్రా వల్ల చెరువులు, నాలాల కబ్జాలు తగ్గిపోతున్నాయన్నారు. గత జూన్ 19న ఏర్పడిన హైడ్రా పనితీరు, పలు కార్యక్రమాలను రంగనాథ్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, హోం సెక్రటరీ రవి గుప్తా, ఎంఏయూడీ కమిషనర్ ఇలంబర్తీ, పోలీస్ అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# నాలుగేండ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

నకిరేకల్ :అమృత్ తెలంగాణ: రాబోయే నాలుగేండ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదలకు కట్టించి ఇస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇంటిని గురువారం ప్రారంభించారు. అదేవిధంగా ఆపరే షన్ సిందూర్‌కు మద్దతు తెలుపుతూ నకిరేకల్ పట్టణంలో ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మొదటి విడతలో ప్రతి నియోజక వర్గానికీ 3500 చొప్పున ఇండ్లు కేటాయించామని, ఇంకా 3 విడత లుగా ఇండ్లను ఇస్తామని చెప్పారు. భూ సమస్యలను పరిష్కరించేం దుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం దేశానికే రోల్ మోడల్ కానుం దన్నారు. జూన్ 2 నుంచి ప్రతి మండలం, ప్రతి రెవెన్యూ గ్రామానికి తహసీ ల్దార్ స్థాయి అధికారులు వచ్చి భూ సమస్యలను పరిష్కరిస్తారని తెలి పారు. భూభారతిలో పెండింగ్‌లో ఉన్న 926000 (తొమ్మిది లక్షల ఇరవై ఆరు వేలు) సాదాబైనమాల దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారందరికీ పూర్తి హక్కులు కల్పించనున్నామన్నారు. భూభారతిలో నకిరేకల్‌ను పైలెట్ మండలంగా తీసుకున్నామన్నారు. ప్రజాపాలన వచ్చిన తర్వాత రాష్ట్రంలో 650 కోట్లు ఖర్చు చేసి తాత్కాలిక తాగు నీటి ఏర్పాట్లు చేశామన్నారు. గడిచిన 15 నెలల్లో వైద్యంపై 11800 కోట్లు ఖర్చు చేస్తే గత ప్రభుత్వం ఏడాదికి రూ.5650 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. 58 నియోజకవర్గాల్లో రూ.11,600 కోట్లతో ప్రతి నియోజకవర్గంలోనూ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షి యల్ పాఠశాలలు కట్టిస్తున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం కోరిక మేరకు నకిరేకల్ మండలానికి నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ఉంటుందని మంత్రి తెలిపారు.



కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లను పారదర్శకంగా కేటాయిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలోనూ ఇందిరమ్మ కమిటీ ఏర్పాటు చేసి రెండు వందల ఇండ్లకు ఒక గెజిటెడ్ అధికారిని ఏర్పాటు చేసి సర్వే నిర్వహిం చిన తర్వాత జాబితా రూపొందించామన్నారు. ఆ జాబితాను ఇన్‌చార్జి మిని స్టర్ ఆమోదంతో లబ్దిదారులకు ఇస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. నకిరేకల్ నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇండ్లు ఎక్కువగా కేటా యించాలని, తహసీల్దార్ కార్యాలయం నూతన భవనాన్ని మంజూరు చేయా లని, గతంలో ఎస్ఎల్ బీసీ కోసం తీసుకున్న భూముల సమస్యను పరిష్క రించాలని మంత్రిని కోరారు. ఇనుపాముల గ్రామంలో ఒకే వ్యక్తిపై 50 నుంచి 100 ఎకరాలు లెక్కించిన దానిని సరి చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు నెల్లి కంటి సత్యం, శంకర్‌నాయక్, మిర్యా లగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ శంబయ్య, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ అమిత్ రెడ్డి, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

# 18న ఇందిరా సౌరగిరి జలవికాసానికి శ్రీకారం


హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈనెల 18న అచ్చంపేట నియోజకవర్గం మన్ననూరులో ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉన్నతాధికారులతో సమీక్షించారు. గిరిజనులకు ఆర్ వో ఎఫ్ ఆర్ చట్టం కింద కేటాయించిన భూములను సాగులోకి తీసుకొచ్చేం దుకు, గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రూ. 12,600 కోట్ల రూపాయలతో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని చేపడుతుననట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ పథకం ప్రారంభానికి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు యావత్తు మంత్రి మండలి పాల్గొంటారని తెలిపారు. ఇందుకోసం అధికారులు యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని దానిని అమలు చేసేలా ముందుకు వెళ్లాలని సూచించారు. రానున్న ఐదేండ్లకాలంలో 2.10 లక్షల మంది రైతులకు సంబంధించిన ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి ఇందిరా సౌర గిరి జల వికాసం ఉపయోగప డుతుందన్నారు. అడవిలో పోడు భూముల సాగుకు కావలసిన విద్యుత్తు సరఫరాకు అటవీశాఖ అనుమతి నిరాకరిం చడంతో దశాబ్దాల తరబడి నిరీక్షిస్తున్న గిరిజన రైతులకు ఈ పథకం ఒక వరం లాంటిదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఏకకాలంలో గిరిజనులు పోడు భూములు సాగు చేసుకోవడానికి ఇంత పెద్ద మొత్తంలో



నిధులు కేటాయించలేదని గుర్తు చేశారు. ఈ పథకం అమలులో ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్లు, విద్యుత్తు, ఉద్యాన వన శాఖ అధికారుల పాత్ర కీలకమన్నారు. పట్టాలు పొందిన గిరిజనుల గ్రామాలను ఎంపిక చేసి ఆ గ్రామాల్లోని భూముల్లో జల వనరుల లభ్యత కోసం జియాలజికల్ సర్వే, తదుపరి బోర్లు వేయడం, సోలార్ పంపు సెట్లు బిగించడం, ప్లాంటేషన్, డ్రిప్ ఏర్పాటు చేయించి గిరిజన రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. అవకాడో, వెదురు, దానిమ్మ డ్రాగన్ ఫ్రూట్, అంజీర్ వంటి పంటలు గిరిజనులు సాగు చేసేందుకు కార్యాచరణ రూపొందించుకొని గిరిజన రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల్లో ఈ పంటల సాగు జరుగుతున్న తీరుపై గిరిజన రైతులకు అవగాహన కల్పించేందుకు స్టడీ టూర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పామాయిల్, వెదురు వంటి పంటలు చేతికి రావాలంటే కనీసం మూడు సంవత్సరాల సమయం పడుతుందని చెప్పారు. ఈలోపు గిరిజనులకు ఆదాయం సమకూరేం దుకు అవసరమైన అంతర పంటల సాగును గుర్తించాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. హిమాచల్ ప్రదేశ్‌లో న్యాచురల్ ఫార్మింగ్ ద్వారా ఆర్గానిక్ కూరగాయలను పండించి ఢిల్లీకి ఎగుమతి చేస్తున్న మాదిరిగానే ఐటిడిఏ ప్రాజెక్టు పరిధిలోని ఏజెన్సీ ఏరియాల్లో ఇదే తరహాలో కూరగా యలను పండించి హైదరాబాదుకు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కూరగా యల సాగుపై గిరిజన రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. దీని ద్వారా రైతులకు అదనంగా ఆదాయం వస్తుందన్నారు. అడవులను పెంచు తూనే, గిరిజనులకు ఆదాయం సమకూర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. ఈ పథకం అమలు కోసం రూపొందించిన విధి విధానాలను ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ శరత్ డిప్యూటీ సీఎంకు వివరించారు. రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీ, జిల్లా స్థాయి అమలు, కొనుగోలు కమిటీ, ప్రత్యేకంగా పోర్టల్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అడవిలో సాగునీటి వసతి, కరెంటు సౌకర్యం లేకుండా దశాబ్దాల తరబడి పంటలు పండించుకోవడానికి నిరీక్షిస్తున్న గిరిజన రైతులు ప్రభుత్వం తీసుకొస్తున్న ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు ఉపముఖ్యమంత్రికి వివరించారు. ఈసమావేశంలో ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖకార్యదర్శి రఘునందన్ రావు, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకి, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఉద్యాన శాఖ కమిషనర్ యాస్మిన్ భాష పాల్గొన్నారు.

# ఇంజినీరింగ్ విద్యార్థులకు జాబ్ గ్యారంటీ శిక్షణ


హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: యువతకు నైపుణ్య శిక్షణనిచ్చి సాఫ్ట్ వేర్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించే మరో కొత్త కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు 'ప్లేస్ మెంట్ సక్సెస్ ప్రోగ్రాం' కింద ఐదు నెలల శిక్షణనిచ్చి ఉద్యోగాలకు సంసిద్ధులుగా తీర్చిదిద్దేందుకు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అయాన్ (టీసీఎస్ఐఓఎన్) ముందు కొచ్చిందని తెలిపారు. గురువారం సచివాలయంలో మంత్రి సమక్షంలో హైదరాబాద్ జేఎన్‌టీయూ, టీసీఎస్ ఐయాన్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. అనంతరం శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఇంజినీరింగ్ చేసినా వారిలో నైపుణ్యం లేక పోవడంతో ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం స్కిల్ ఇండియా యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 'సాంకేతిక నైపుణ్యాలు లేకుండా డిగ్రీలతో ఉద్యోగాలు రావడం



కష్టం. చదువు పూర్తి చేసే సమయానికి ప్రతి ఒక్కరికీ ఏదో ఒక అంశంలో నైపుణ్యం పెంచగలిగితే ఉద్యోగాలు ఇవ్వడం కోసం కంపెనీలు వాటికవే పరుగెత్తుకుంటూ వస్తాయి. టీసీఎస్ ఐయాన్ సంస్థ మొదటి దశలో ప్రతి ఐదు నెలల(20 వారాల)కు వంద మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలకు సిద్ధం చేస్తుంది. ఆ సంస్థతో సంబంధం కలిగిన మూడు వేలకు పైగా కంపెనీలు వీరిలో ప్రతిభావంతులను ఎంపిక చేసుకుని ఉద్యోగాలు కల్పిస్తాయి. పైలట్ కార్యక్రమం కింద మంథనిలోని జేఎన్‌టీయూ కళాశాల విద్యార్థులకు ప్లేస్ మెంట్ సక్సెస్ ప్రోగ్రాం కింద నైపుణ్య శిక్షణకు ఎంపిక చేస్తాం" అని శ్రీధర్ బాబు వెల్లడించారు. గ్రామీణ ప్రాంత యువ తను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగ సంసిద్ధత కార్య క్రమాలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. అవగాహన ఒప్పంద కార్యక్రమంలో టీసీఎస్ ఐయాన్ గ్లోబల్ హెడ్ వెంగుస్వామి, స్కిల్ ఎడ్యుకేషన్ బిజినెస్ హెడ్ స్మృతి ముల్యే, జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ టి కిషన్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ పాల్గొన్నారు.

## పన్ను వసూళ్లు సరే.. అభివృద్ధి సంగతేంటి?

మేడ్చల్, మే8 :అమృత్ తెలంగాణ: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మున్సిపాలిటీలలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు ఆస్తి పన్నులకు 5శాతం రాయితీని ప్రకటించిన నేపథ్యంలో 33 రోజులలో రూ.103 కోట్ల ఆస్తి పన్నులు వసూళ్లు అయ్యాయి. ఏప్రిల్ 1 నుంచి ఈనెల 3 వరకు ముందస్తు ఆస్తి పన్నులు చెల్లించిన వారికి 5 శాతం రాయితీని అందించారు. దీంతో జిల్లాలోని 13 మున్సిపాలిటీలలో 28శాతం ఆస్తి పన్నుల వసూళ్లు జరిగాయి. నాలుగు కార్పొరేషన్ల పరిధిలో బోడుప్పల్‌లో రూ.8.98 కోట్లు, పీర్జాదిగూడ రూ.12.96 కోట్లు, జవహర్‌నగర్ రూ. 2.35 కోట్లు, నిజాంపేట్ రూ.26 కోట్లు వసూళ్లు జరగగా మున్సిపాలిటీలలో పోచారంలో రూ.4.28 కోట్లు, తూముకుంట రూ. 6.70 కోట్లు, నాగారంలో రూ.7.40 కోట్లు, మేడ్చల్‌లో రూ. 5.05 కోట్లు, కొంపల్లిలో రూ. 5.11 కోట్లు, ఘట్‌కేసర్‌లో 2.03 కోట్లు, గూండ్లపోచంపల్లిలో 7.76 కోట్లు, దమ్మాయిగూడలో రూ. 3.91 కోట్లు, దుండిగల్‌లో




రూ.11.16 కోట్ల మేర పన్ను వసూళ్లు అయ్యాయి.

పన్ను వసూళ్లపైనే దృష్టి..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని మున్సిపాలిటీలలో ఆస్తిపన్నుల వసూళ్లపై పెడుతున్న దృష్టి ఆయా ప్రాంతాల అభివృద్ధిపై పెట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. శివారు ప్రాంతాల మున్సిపాలిటీలలో అనేకంగా నూతన కాలనీలు ఏర్పడుతున్న క్రమంలో మౌలిక వసతులు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అవుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలిసిన మాజీ మంత్రి జోగు రామన్న



అమృత్ తెలంగాణ హైదరాబాద్ న్యూస్ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలిసిన మాజీ మంత్రి జోగు రామన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన రామకృష్ణ రావు ను మాజీ మంత్రి జోగురామన్న మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ లోని సచివాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడం పట్ల అభినందనలు తెలియచేశారు. అనంతరం ఆదిలాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలు, ఇతరత్రా విషయాలపై చర్చించారు.

## గల్ఫ్‌లో హత్యకు గురైన ప్రేమ్ సాగర్ కుటుంబానికి అండగా నిలుస్తాం: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : ఉపాధి కోసం దుబాయ్‌కు వెళ్లిన నిర్మల్ జిల్లా సోన్ గ్రామానికి చెందిన ప్రేమ్ సాగర్ ఇటీవలి కాలంలో అక్కడ హత్యకు గురవడం తీవ్ర విషాదానికి దారి తీసింది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ భరోసా ఇచ్చారు. గురువారం సాయంత్రం కలెక్టర్ ఛాంబరులో ప్రేమ్ సాగర్ కుటుంబ సభ్యులు కలెక్టర్‌ను కలిసి తమ బాధను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాధితులను ఓదార్చి, వారికి తగిన ధైర్యం చెప్పారు. ప్రేమ్ సాగర్ హత్య చాలా బాధాకరం. ప్రభుత్వం తరఫున ఎలాంటి సహాయం అవసరమైనా అందించేందుకు చర్యలు తీసుకుంటామని, పిల్లల విద్య కోసం అన్ని విధాలా తోడుంటామని అని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రేమ్ సాగర్ భార్య ప్రమీల, పిల్లలు, తల్లి లక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులతో పాటు రాష్ట్ర ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ సభ్యులు స్వదేశ్ పరికిపండ్ల తదితరులు ఉన్నారు.

## మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు..



సిరిసిల్ల .అమృత్ తెలంగాణ: రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు వెంకట్ రెడ్డి, కన్వీనర్లు బుర్ర వివేక్ గౌడ్, తిప్పవరపు అనిల్, కో కన్వీనర్లు తిరుపతి,అన్సర్ అలీ, స్పోకెన్ పర్సన్స్ భగవాన్, బొద్దుల రాజేష్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రైతుల బాధలు వినే నాథుడే లేడు : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్




ఆసిఫాబాద్ :అమృత్ తెలంగాణ: అకాల వడగండ్ల వాన వల్ల వరి పండించే రైతులు భారీగా నష్టపోయారని తెలిసి సిర్పూర్ నియోజకవర్గంలోని కౌటాల మండలంలోని పలు గ్రామాల్లో రైతులను కసినట్లు బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. రైతులను కలిసి మాట్లాడుతుంటే వారి బాధ వర్ణనాతీతం అని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రైతుల బాధలు వినే నాథుడే లేడు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందే నన్ను కోసినా రూపాయి లేదని తెలివిగా చేతులెత్తేసిండు. బీజేపీ పార్టీ రైతులకు అందనంత దూరంలో దాక్కుంది. ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా కనీసం ఎమ్మెల్యే రైతులను పలకరించే పరిస్థితి లేదు. రైతులంతా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే బాగుండేదని బాధపడుతున్నారు. తిరిగి తెలంగాణను కాపాడుకుంటమని శపథం చేస్తున్నారు. తక్షణమే రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

## గ్రామీణాభివృద్ధి సంస్థకు రాష్ట్ర అవార్డు



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) రాష్ట్ర స్థాయి అవార్డును కైవసం చేసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలకు లక్ష్యానికి మించి బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయడమేకాక, రుణాల రికవరీలోనూ రాష్ట్రంలో ప్రథమ స్థానాన్ని సాధించింది. ఈ కృషికి గాను హైదరాబాద్‌లోని మహాత్మ జ్యోతిబా పూలె ప్రజా భవన్ లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, మహిళాశిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి డి.అనసూయ సీతక్క, ప్రధాన కార్యదర్శి లోకేశ్ కుమార్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ అవార్డును ప్రదానం చేశారు. అవార్డును జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణి, డిపిఎం జ్ఞాను, ఏపీఎం సుదర్శన్‌లు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అవార్డు రావడానికి ప్రోత్సాహం కల్పించిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్‌లకు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం కల్పించాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పాలన అధికారి అభిలాష అభినవ్

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సమర్థవంతమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో వైద్యశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, వైద్య పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం లభ్యం కాక కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. అంబులెన్సు సేవలు సమయానికి అందేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, అందుబాటులో ఉన్న వాహనాల వివరాలు తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వచ్చే రోగులకు తక్షణమే వైద్యం అందాలని, పేదలకు మెరుగైన వైద్యం అందుతోందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్గించాలన్నారు. వైద్యులు, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి రాజేందర్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకుడు గోపాల్ సింగ్, వైద్యాధికారులు సురేష్, సౌమ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా టాపర్లకు కలెక్టర్ విందు.



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి ప్రభుత్వ పాఠశాల జిల్లా టాప్ విద్యార్థులకు జిల్లా కలెక్టర్, జడ్జి, ఎస్పీ అభినందనలు. పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల 13 మంది విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. గురువారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లా విద్యార్థులు పదవ తరగతిలో మెరుగైన ప్రతిభ కనబరిచారు. ఇది అందరికీ గర్వకారణం. లక్ష్యాన్ని నిర్ణయించుకొని కృషిచేస్తే జీవితం లో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నవారి ఉదాహరణలు గుర్తుచేశారు. జిల్లా జడ్జి శ్రీమతి శ్రీవాణి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు జీవితానుభవం ఎక్కువగా లభిస్తుంది. వారు చిన్నప్పటి నుంచే సమస్యల పరిష్కార నైపుణ్యం అలవర్చుకుంటారని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే విజయాన్ని సాధించడం సాధ్యమేనన్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, మీరు సాధించిన విజయం జిల్లాకు గర్వకారణం. మరింత ఉన్నత లక్ష్యాలు సిద్ధించేందుకు కృషి చేయండి అని విద్యార్థులను ప్రోత్సహించారు. అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీఈఓ పి. రామారావు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు మాట్లాడారు. విద్యార్థులకు అందించిన ప్రోత్సాహంతోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని, ఈ క్రెడిట్ కలెక్టర్‌కే చెందుతుందని అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలెక్టర్ ముఖాముఖి చర్చలు జరిపారు. వారి అభిప్రాయాలు, లక్ష్యాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్, జిల్లా జడ్జి, ఎస్పీ, ఇతర అధికారులు విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తే కలిసి భోజనం చేస్తాను అని కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకే ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అవగాహన సాగుతో అధిక దిగుబడులు..

## ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



ముధోల్:అమృత్ తెలంగాణ: వ్యవసాయంపై అవగాహనతో పంటల సాగులో నాణ్యమైన ఉత్పత్తులను,అధిక దిగుబడులు సాధించవచ్చని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశానుసారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలం లోని వెంకటా పూర్ గ్రామంలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా మట్టి నమూనా పరీక్ష లు చేయించుకోవాలని సూచించారు సేంద్రియ ఎరువులతోని అధిక దిగులు సాధించవచ్చని పేర్కొన్నారు అధిక యూరియా వాడుతున్నారని దీంతో భూమి సారం కోల్పోతుందని అన్నారు. కెపాసిటీ మించి రసాయన ఎరువులు వాడకూడదని శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన సలహా సూచనలు పాటిస్తూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాదించాలని అన్నారు. సేంద్రియ ఎరువులు వాడటం వలన భూసారం పెరగడంతో పాటు రైతుకు ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయని పేర్కొంన్నారు. అలాగే ఏరువాక ,వ్యవసాయ పరిశోధనా స్థానం ముధోల్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నర్సయ్య మాట్లాడుతూ రైతులు భూమిని కాపాడాలని పేర్కొన్నారు. ఎక్కువ రసాయన ఎరువులతో పాటు యూరియా వలన భూమిలోని సారమంత కోల్పోయి నిర్జీవంగా మారుతుందని దీంతో దిగుబడులు తగ్గుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరు తాము సూచించిన సలహా సూచన లు పాటిస్తూ అధిక దిగుబడును పొందాలని ఉద్దేశంతోనే ప్రభుత్వం బృహత్తర కార్యక్రమం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలన్నే కార్యక్రమం శ్రీకారం చుట్టిందని అన్నారు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, డిఎఓ అంజిప్రసాద్,అర్టికల్చర్ జిల్లా అధికారి రమణ,ఎడిఎ వినయ్ బాబు,శాస్త్రవేత్తలు డా.విజయ్ కుమార్,డా.కార్తీక్,జావిద్ బాషా, నాయకులు నర్సగౌడ్, కోరి పోతన్న,టి రమేష్,దేవోజి భూమేష్,సురేందర్ రెడ్డి,సాయినాథ్,రామ్ నాథ్, రైతులు తదితరులు, పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో గన్నీ సంచులు



దస్తురాబాద్,మే 8 అమృత్ తెలంగాణ:: రైతులకు గన్నీ సంచులను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ ఆదేశించారు. గురువారం మండలంలోని రేవోజిపేట గ్రామంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కొనుగోల కేంద్రంలో తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. తేమ శాతం వచ్చిన గన్నీ సంచులు ఇవ్వడం లేదని రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకపోవడంతో అధికారులు, నిర్వాహకుల పైన ఆయన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

తేమ శాతం వచ్చిన రైతులకు గన్నీ సంచులను అందించాలని ఆదేశించారు. తేమ శాతం వచ్చిన రైతుల పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. లారీల కొరత,గన్నీ సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. రెండు లారీలలో ధన్యాం బస్తాలను లోడ్ చేసి తక్షణమే రైసు మిల్లుకు పంపించాలన్నారు.అలాగే గన్నీ సంచులు సైతం గోదాం నుండి తెప్పించాలని అధికారులకు సూచించారు. ధాన్యం పంపిన రిపోర్టులను, గన్నీ సంచుల రిపోర్టును అందించాలని రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులకు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. కాగా పీఏసీఎస్ సీఈవోకు నోటిసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. డీసీవో కల్లె పాపయ్య, డీఎం సుధాకర్,డిప్యూటీ తహసీల్దార్ యాదవ రావు, సీనియర్ అసిస్టెంట్ సంతోశ్, రైతులు,తదితరులు ఉన్నారు. కాగా, దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## సీఎస్ఐఐ సంఘాల ఆధ్వర్యంలో మే 9 నుంచి క్రైస్తవ ఉజ్జీవ మాహాసభలు



కమాన్ చౌరస్తా, మే 8 :అమృత్ తెలంగాణ: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మే 9, 10, 11 తేదీలలో సీఎస్ఐఐ సంఘాల ఆధ్వర్యంలో సెయింట్ మార్కు చర్చి గ్రౌండ్లో క్రైస్తవ ఉజ్జీవ మాహాసభలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పాస్ట్రేట్ చైర్మన్ సీ రాములు ఇమ్మానుయేల్, అధ్యక్ష మండల కోశాధికారి డాక్టర్ ఎస్ జాన్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడి, కరపత్రం విడుదల చేశారు. మానవత విలువలతో కూడిన ఫలభరితమైన జీవితం జీవించేందుకు, సమాజంలో మార్పు నిమిత్తం ఈ ఉజ్జీవ మాహాసభలు నిర్వహిస్తున్నమని చెప్పారు. ఈ సభలలో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో విశేష ఆదరణ కలిగిన వైజాగ్కు చెందిన బ్రదర్ డాక్టర్ ఎం జేమ్స్ స్టీఫెన్ వాక్య పరిచర్య చేస్తారని చెప్పారు. జిల్లా వాసులు పెద్ద సఖ్యలో ఈ ఉజ్జీవ మాహాసభలలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్ కొమ్మాలు, డాక్టర్ ఎస్ జాన్, ఆర్ ప్రసాద్, బి ప్రసాద్, 4ఎ మధు మోహన్, పింటు, రోజి, యన్ సత్యానందం, రెనాల్డ్, నారాయణ, మాణిక్య రావు, రాధిక, ఇండిపెండెంట్ పాస్టర్స్, స్థానిక సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

## రక్షణ చట్టాలపై మహిళా ఉద్యోగులకు అవగాహన



చుంచుపల్లి, మే 08 :అమృత్ తెలంగాణ: కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు మహిళా రక్షణ చట్టాలపై చుంచుపల్లి మండల కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో గల జీవీ మాల్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి గురువారం షీ టీమ్ అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా షీ టీమ్ ఎస్ఐ రమాదేవి మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం షీ టీమ్ పనిచేస్తుందని తెలిపారు. ఎలాంటి సమయాల్లోనైనా మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మహిళలను ర్యాగింగ్ చేయడం, అనుసరించడం, కామెంట్ చేయడం, రాంగ్ కాల్స్, మేసేజ్‌లు చేయడం, సోషల్ మీడియాలో సైతం అభ్యంతరకరంగా ప్రవర్తిస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. మహిళలు ఏ విధంగానైనా ఇబ్బందులకు గురైతే షీ టీమ్‌ని నిర్భయంగా సంప్రదించవచ్చు అన్నారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచబడునని తెలిపారు. మహిళలు ఫిర్యాదు ఇవ్వాలనుకుంటే కొత్తగూడెం షీ టీమ్ ఫోన్ నంబర్ 8712682131కి కాల్ చేసి తెలుపొచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీవీ మాల్ సూపర్ వైజర్ రమేశ్, హెడ్ కానిస్టేబుల్ నాగయ్య, కానిస్టేబుల్ రాంబాబు, హెూంగార్డ్ రాజు పాల్గొన్నారు.

# పంట మార్పిడీతో అధిక దిగుబడులు సాధించవచ్చు

కోటగిరి :అమృత్ తెలంగాణ: పంట మార్పిడీ పాటించడం ద్వారా నేల సారాన్ని మెరుగుపరచడంతో పాటు పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని దింతో అధిక దిగుబడులు సాధించవచ్చుఅని ప్రాంతీయ వరి పరిశోధన స్థానం రుద్రూర్ శాస్త్రవేత్త డాక్టర్ రమ్య రాథోడ్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శాస్త్రవేత్త ఆర్ జయ ప్రకాష్ అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా గురువారం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. పంటకు మోతాదుకు మించి ఎరువులు వాడవద్దని సూచించారు. రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. పంటలకు పురుగు మందులు సైతం అవసరం మేరకే వాడాలన్నారు. విత్తనాలు ఎరువులు పురుగు మందులు కొనుగోలు చేసినప్పుడు దుకాణంలో ఖచ్చితంగా రసీదు తీసుకోవాలన్నారు. పంట మార్పిడీలో భాగంగా రైతులు పప్పు దినుసులు, నూనె గింజల పంట సాగుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోటగిరి మండల వ్యవసాయ అధికారి రాజు,



కోటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, వైస్ చైర్మన్ అనిల్ కులకర్ణి, మాజీ ఎంపీటీసీ కొట్టంమనోహర్, ఏఈవోలు ఆస్మా బేగం,గౌస్, రైతులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ కు చేయుతనివ్వండి..



కంఠేశ్వర్ : అమృత్ తెలంగాణ: జిల్లా వ్యాప్తంగా జూన్ మాసంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయడానికి చేయుతనివ్వాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్ పర్సన్ జి.వి.ఎన్ భరత లక్ష్మీ కోరారుఈ మేరకు గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశపు హల్ లో అదనపు జిల్లాజడ్జి హరీష, న్యాయసేవ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ భాస్కర్ రావు లతో కలిసి బీమా కంపెనీల స్టాడింగ్ కౌన్సిల్స్,అధికారులు, న్యాయవాదులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె ప్రసంగించారు. మోటారు రోడ్డు ప్రమాద నష్ట పరిహార దావాలను లోక్ అదాలత్ లో భీమా కంపెనీలు, న్యాయవాదులు ఒక రాజీ పరిష్కారం దిశగా అడుగులు వేస్తే, న్యాయస్థానాలు సహకరించి,సలహాలిచ్చి నష్టపరిహార దావాలను తుదిరూపం తీసుకోవడానికి చేదోడుగా నిలుస్తామని ఆమె అన్నారు.లోక్ అదాలత్ లో రాజీపద్ధతిన అవార్డులు అందుకున్న దావాలలో భీమా కంపెనీలు త్వరితగతిన నష్టపరిహార డబ్బులను కోర్టులో డిపాజిట్ చేస్తాయని తెలిపారు. అట్టి డబ్బు మోటారు వాహన ప్రమాదంలోని బాధితులకు చేరుతుందని,అది వారి ఆర్థిక అవసరాలకు పనికి వస్తుందని పేర్కొన్నారు. ముందస్తుగా కేసులను పరిష్కరించుకుంటే భీమా సంస్థలకు ఆర్థిక లబ్ది కూడా చేకూరుతుందని ఆమె తెలిపారు. బాదిత కుటుంబాల ఆర్థిక నిరీక్షణను అంతం చేసిన వారం కాగలమని జిల్లాజడ్జి తెలిపారు. జూన్ 14 న జరిగేజాతీయలోక్ అదాలత్‌ను నడిపించేది, నడక చూపించేది న్యాయమూర్థులు,న్యాయవాదులేనని ఆమె అన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగ భీమా కంపెనీలు కలిసికట్టుగా వస్తే పరిష్కారం కానిదేముందని ఆమె అభివర్ణించారు. బీమా కంపెనీల న్యాయవాదులు, నష్టపరిహార దావాలోని న్యాయవాదులు, భీమా కంపెనీల అధికారులు ఒక అంగీకారానికి వస్తే, న్యాయమూర్తులు చేదోడు వాదోడుగా నిలుస్తారని ఆమె వెల్లడించారు.సమావేశంలో ప్రభుత్వ భీమా కంపెనీల న్యాయవాదులు మంచికట్ల గోవర్ధన్,ఆనంద్ రెడ్డి, అంకిత, గణేశ్ దేశ్పాండే, ఎం.వి.నరసింహ రావు,వి.భాస్కర్, ఆర్.మోహన్,సదానంద్ గౌడ్, న్యాయవాదులు రఘువీర్ భూపాల్, అల్గోట్ రవీందర్, మహేష్,ముత్యాల కృష్ణారెడ్డి, పిట్లం శ్రీనివాస్ ,ప్రభుత్వ రంగస్థ0స్థల బీమా కంపెనీలు నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ లాలూ వంకదోథ్ ,ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ బోదుకం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం బల్దియాకు మరో గుర్తింపు.. ఆస్తి పన్ను వసూళ్లలో రాష్టంలోనే ప్రథమ స్థానం అదనపు కలెక్టర్ అరుణ శ్రీ స్పెషల్ ఫోకస్

కోల్ సిటీ, మే 8 :అమృత్ తెలంగాణ: రామగుండం నగరపాలక సంస్థకు మరో గుర్తింపు లభించింది. ఆస్తి పన్ను వసూళ్లలో రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు దీటుగా మొదటి స్థానం దైవసం చేసుకుంది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ జె అరుణ శ్రీ ప్రత్యేక చొరవతో ప్రవేశపెట్టిన ఎర్లీ బర్డ్ ఆఫర్ ఫలించింది. అధికారుల సమిష్టి కృషితోనే ఇది సాధ్యమైందని ఆమె పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 ఆస్తిపన్ను చెల్లించిన వారికి పన్ను మొత్తంలో ఐదు శాతం రాయితీ ప్రకటిస్తూ ప్రభుత్వం ఏప్రిల్ మొదటి వారంలో ఎర్లీ బర్డ్ ఆఫర్ ప్రకటించింది. ఎర్లీ బర్డ్ ఆఫర్ గడువు మొదట ఏప్రిల్ 30 తో ముగిసిపోయినప్పటికీ ప్రజల అభ్యర్థన మేరకు మే 7 వరకు ప్రభుత్వం పొడిగించింది. గడువు ముగిసిపోయే సమయానికి రామగుండం నగర పాలక సంస్థ 47.91 శాతం పన్ను వసూలు సాధించి ఇతర మున్సిపల్ కార్పొరేషన్లతో పోలిస్తే ప్రథమ స్థానంలో , రాష్టంలోని



151 పట్టణ స్థానిక సంస్థలలో నాలుగవ స్థానంలో నిలిచింది. రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో 51,033 ఆస్తి పన్ను అస్సెస్మెంట్లు ఉండగా మొత్తం పన్ను డిమాండ్ రూ 19 . 14 కోట్లు ఉంది. ఇందులో 13, 915 పన్ను అస్సెస్మెంట్ల నుండి రూ 9.7 కోట్లు వసూలయింది. రామగుండం నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష , కమిషనర్ గా వ్యవహరిస్తున్న అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) అరుణ శ్రీ ఎప్పటికప్పుడు పన్ను వసూళ్ల పురోగతిని సమీక్షిస్తూ సిబ్బందికి మార్గ నిర్దేశం చేయడంతో స్వల్ప వ్యవధిలోనే రామగుండం నగర పాలక సంస్థ ఈ ఘనత సాధించింది. పన్ను వసూళ్లలో రామగుండం నగర పాలక సంస్థ ముందంజలో ఉండడానికి కృషి చేసిన డిప్యూటీ కమిషనర్ వెంకట స్వామి , ఆర్ఓ ఆంజనేయులు, ఆర్ఐ లు శంకర్ రావు , ఖాజా,వార్డు అధికారులు ,బిల్ కలెక్టర్లను రామగుండం నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారి తోపాటు కమిషనర్ అభినందించారు.

# హాట్సాఫ్ సింధూర్.. పహల్గాం మృతులకు నివాళులర్పించిన ఈజీఎస్ కూలీలు

ఎల్లారెడ్డి రూరల్ :అమృత్ తెలంగాణ: పహల్గాం ఉగ్రదాడికి ప్రతిచర్యగా భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ కు మద్దతు పలుకుతూ హాట్సాఫ్ సింధూర్ అంటూ ఉపాధి హామీ కూలీలు తమ హర్షాన్ని ప్రకటించారు. ఎల్లారెడ్డి మండలం భిక్కనూరు గ్రామంలో పనికి వచ్చిన ఉపాధి హామీ కూలీలు పహల్గాం దాడిలో మరణించిన భారతీయుల మృతికి గురువారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమాయకులైన యాత్రికులపై పాకిస్తాన్ ఉగ్రమూకలు దాడి చేయడం సిగ్గుచేటన్నారు దీనికి ప్రతీకార చర్యగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్




సింధూర్ పట్ల వారు హర్షం ప్రకటించారు. ఆపరేషన్ సింధూర్ కోట్లాది భారతీయులను ఆనందంలో ముంచివేసిందన్నారు. భారత్ జోలికి వస్తే ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ గోనె శ్రీకాంత్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ భాగయ్య, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# అలా చూడటం చాలా తప్పంటున్న సంయుక్త మీనన్!



గ్లామర్ షో అంటే.. చిట్టి పొట్టి దుస్తులను ధరించడమే అని నమ్మేవారు ఎందరో ఉన్నారు. కానీ గ్లామర్ ను డ్రెస్ తో కనెక్ట్ చేసి చూడటం చాలా తప్పంటోంది సంయుక్త మీనన్. మలయాళంకు చెందిన ఈ ముద్దుగుమ్మ.. 2016 లో 'పాప్ కార్న్' అనే మూవీతో సినీ కెరీర్ ను ప్రారంభించింది. ఆ తర్వాత మలయాళంలో వరుస సినిమాలు చేస్తూ తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు సంపాదించుకున్న ఈ బ్యూటీ.. 'భీమ్లా నాయక్'తో టాలీవుడ్ లోకి అడుగు పెట్టింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ రానా దగ్గుబాటి ప్రధాన పాత్రల్లో సాగర్ కె.చంద్ర ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. ఇందులో రానా భార్య పాత్రను పోషించిన సంయుక్త.. తనదైన నటనతో మంచి మార్కులు వేయించుకుంది. ఇక త్వరలోనే ఈ అమ్మడు 'బింబిసార'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధం అవుతోంది. ఇందులో నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా నటిస్తే.. మల్లిడి వశిష్ట దర్శకత్వం వహించాడు. ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్పై హరికృష్ణ నిర్మించిన ఈ సినిమాలో కేథరిన్ థ్రెసా సంయుక్త మీనన్ హీరోయిన్లుగా నటించారు. మగధ రాజ్యాధిపతి అయిన బింబిసారుడు జీవితం ఆధారంగా ఈ మూవీని రూపొందించారు. ఇందులో కళ్యాణ్ రామ్ ద్విపాత్రాభినయం చేశాడు. భారీ అంచనాలు ఉన్న ఈ చిత్రం ఆగస్టు 5న అట్టహాసంగా విడుదల కాబోతోంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో.. ఓవైపు వరుస అప్డేట్స్ మరోవైపు ప్రచార కార్యక్రమాలతో మేకర్స్ సినిమాపై మంచి బజ్ ను క్రియేట్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే సంయుక్త మీనన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. ఈ సందర్భంగా ఆమె వృత్తిపరమైన విషయాలే కాకుండా వ్యక్తిగత విషయాలను సైతం షేర్ చేసుకుంది. నటిని అవుతానని అనుకోలేదని అనుకోకుండా అవకాశం రావడంతో సినిమాలు చేశానని చెప్పుకొచ్చిన సంయుక్త.. మలయాళంలో తాను చేసిన సినిమాలు మంచి గుర్తింపును తీసుకొచ్చాయని తెలిపింది. అలాగే తెలుగులో తొలి అవకాశం 'బింబిసార'లోనే వచ్చినా.. 'భీమ్లా నాయక్' మొదట విడుదలైందని వివరించింది. ప్రస్తుతం సాయి ధరమ్ తేజ్ తో ఓ సినిమా ధనుష్ తో 'సార్' మలయాళంలో ఓ పెద్ద సినిమా చేస్తున్నట్లు ఆమె తెలిపింది.

# ఐటం పాటల్లో శ్రీలీల.. కిసిక్ బ్యూటీ కండీషన్ అప్లై!



కిసిక్ పాటతో శ్రీలీల పాన్ ఇండియాలో ఎంత ఫేమస్ అయిందో చెప్పాల్సిన పనిలేదు. ఒక్క పాట అమ్మడిని రాత్రికి రాత్రే ఫేమస్ చేసింది. కిసిక్ పాటతో శ్రీలీల పాన్ ఇండియాలో ఎంత ఫేమస్ అయిందో చెప్పాల్సిన పనిలేదు. ఒక్క పాట అమ్మడిని రాత్రికి రాత్రే ఫేమస్ చేసింది. ఎంతో మంది భామలున్నా ఆ ఛాన్స్ సుకుమార్ కేవలం శ్రీలకు మాత్రమే ఇచ్చాడు. అమ్మడు కూడా ఆ నమ్మకాన్ని అంతే నిలబెట్టుకుంది. మాస్ అప్పిరియన్స్ తో కుర్రాకారు హృదయాలు దోచేసింది. కిసిక్ లాంటి పాటలు చేయాలంటే? అది శ్రీలీలతో మాత్రమే సాధ్యమవుతుందని ఒక్క పాటతోనే పాన్ ఇండియాకి చాటి చెప్పింది. పుష్ప-2 తో అంతటి సంచలనాన్ని నమోదు చేసింది. అయితే ఆ పాట తర్వాత చాలా మంది తనని ఐటం పాటల్లో నటించమని అడిగారుట. అడిగినంత పారితోషికం చెల్లించడానికి రెడీగా ఉన్నారంది శ్రీలీల. తాను ఎస్ చెప్పాలే గానీ కోట్ల రూపాయలు తన అకౌంట్ లో జమ అవుతాయని తెలిపింది. కానీ వచ్చిన చాలా అవకాశాలు ఇష్టం లేక వదులుకున్నానంది. కేవలం కొన్ని సినిమాల్లో మాత్రమే అలాంటి పాటల్లో నర్తిస్తానని...డబ్బులిస్తారని ఏ సినిమా పడితే ఆ సినిమాలో అలాంటి పాటల్లో నటించనని తెగేసి చెప్పిందిట. ఐటం పాటల్లో నటించిన తనకంటూ కొన్ని కండీషన్లు ఉన్నాయని...

వాటికి లోబడే పని చేస్తానని తెలిపింది. జాతీయ స్థాయి చిత్రాల్లో నటించాలనే ఆశను వ్యక్తం చేసింది. అలాంటి సినిమా అవకాశాలు వస్తే వదులుకోనని తెలిపింది. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలుగు అమ్మాయిగా తనని గుర్తిస్తున్నారంది. ఇతర భాషల్లో అవకాశాలు వచ్చినంత మాత్రాన తెలుగు సినిమాలకు దూరమవుతానని అనుకోవద్దు. తన మొదటి ప్రాధాన్యత తెలుగు సినిమాలకేనని తెలిపింది. తెలుగులో పాటు ఇతర భాషల అవకాశాల్ని బ్యాలెన్స్ చేస్తూ కెరీర్ లో ముందు కెళ్తానని స్పష్టం చేసింది.

# 'ఛావా' కారణంగా నాగ్‌పూర్ అల్లర్లు.. టెన్షన్‌లో నటి!

ఇప్పుడు స్వరా 'ఎక్స్'లో పోస్ట్ చేసిన రెండు ట్వీట్లు దుమారం రేపుతున్నాయి. చాలా కాలంగా పరిశ్రమకు దూరంగా ఉన్న బాలీవుడ్ నటి స్వర భాస్కర్ ఇండస్ట్రీలో పలు అంశాలపై నిరంతరం సోషల్ మీడియాల్లో తన అభిప్రాయం చెబుతున్నారు. వీటిలో కొన్ని వివాదాల్ని కూడా మోసుకొస్తున్నాయి. ఇప్పుడు స్వరా 'ఎక్స్'లో పోస్ట్ చేసిన రెండు ట్వీట్లు దుమారం రేపుతున్నాయి. వీటిలో నాగ్‌పూర్ అల్లర్లకు 'ఛావా' సినిమానే కారణం అని ఒక ట్వీట్ లో పేర్కొనగా, మరొక ట్వీట్‌లో నటుడు కునాల్ క్రమాను ప్రశంసిస్తూ, ఏక్‌నాథ్ షిండే కి వ్యతిరేకంగా ట్వీట్ చేయడం హాట్ టాపిగ్గా మారింది. స్వరా పోస్ట్‌లలో ఒకదానిలో "ఛావా చిత్రం రెచ్చగొట్టేది. విక్కీ కౌశల్ - నిర్మాతలు నాగ్‌పూర్ అల్లర్లకు బాధ్యులు. ఈ చిత్రాన్ని భారతదేశం అంతటా నిషేధించాలి" అని రాశారు. అదే సమయంలో రెండవ ట్వీట్‌లో "కునాల్ క్రమా కామెడీ షో ఒక కళ" అని రాశారు. షిండే మద్దతుదారులే ఈ విధ్వంసానికి బాధ్యులు! అని కూడా ట్వీట్ లో రాసారు. ఈ రెండు ట్వీట్లు ఇంటర్నెట్‌లో వేగంగా వైరల్ అవుతున్నాయి. ఇవి ప్రజల దృష్టిని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. అయితే నెటిజనుల నుంచి ఊహించని విమర్శలు ఎదురవ్వడంతో స్వరా తాజాగా దీనిపై స్పందించారు. ఈ ట్వీట్‌లను తాను చేయలేదని, ఇవన్నీ నకిలీ ట్వీట్లు అని పేర్కొన్నారు. దయచేసి వాస్తవాలను తెలుసుకోండి అని కూడా స్వరా అభ్యర్థించారు ఫేక్ పోస్ట్‌లకు సంబంధించిన కొన్ని స్క్రీన్‌షాట్‌లను స్వరా షేర్ చేసారు. మూర?పు రైటిస్టులు మళ్ళీ వారు చేయగలిగినది చేయడం ప్రారంభించారు




# మాళవిక అందం పాల మీగడ సొగసు!



నటి కం మోడల్ మాళవిక శర్మ టాలీవుడ్ లో పెద్ద కెరీర్ ని ఆశిస్తున్న సంగతి తెలిసిందే. కానీ కాంపిటీషన్ లో రయ్ మని దూసుకెళ్లడానికి చాలా సమయం పడుతుందని అర్థం చేసుకుంది. ఈ బ్యూటీ ప్రస్తుతం న్యాయశాస్త్రంలో పట్టా పొంది లాయర్ గా ప్రాక్టీస్ చేస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు నటనను వాణిజ్య ప్రకటనల రంగాన్ని విడిచిపెట్టడం లేదు.సోషల్ మీడియాల్లోనూ చాలా యాక్టివ్ గా ఉండే మాళవిక శర్మ తరచూ తన ఫోటోషూట్లను అభిమానులకు షేర్ చేస్తోంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309, ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com